

కథ

# మమకారం

— సూరేపల్లి విజయ

"ఏవండి, భోజనానికి రండి'' అన్నది సుధ.

'వద్దు సుధా ఆకలి లేదు మీరు తినండి' అన్నాడు సుధాకర్.

'ఇంత ఆలస్యమైంది ఆకలెందుకు లేదు? టామి గురించేగా మీ దిగులు, నాకు మాత్రం లేదా?'

'నీకు దిగులెందుకు ఉన్నప్పుడు ఒకటే విసుకున్నావుగా'

'అలా అనకండి అప్పుడు తెలియలేదుగాని ఇప్పుడు ప్రతి క్షణం టామి గుర్తుకు వస్తుందండి. పిల్లలు కూడా బిక్కుబిక్కుమంటున్నారు. పిల్లలతో పూర్తిగా కలిసిపోయింది. ఇల్లంతా తిరుగుతూ సందడిగా ఉండేది ఇప్పుడంతా బోసిపోయింది.'

'ఇప్పుడనుకొని ఏం లాభం సుధా! పంపిచేశావుగా'

ఆ మాట వినగానే గుండెల్లో ముల్లులాగా గుచ్చుకున్నట్టయి అలాగే కూర్చుండిపోయింది. మనసు గతంలోకి మళ్లింది.

★★★

'సుధా ఏం తెచ్చానో చూడు'

సుధాకర్ చేతిలో కుక్కపిల్లను చూసి అంత దూరం పరిగెత్తింది సుధ.

'ఎందుకండి ఇపుడు ఉన్న సందడి చాలకన మళ్ళీ దీన్ని తెచ్చారు. ఎవరు చేస్తారు దీనికి చాకిరి' అన్నది విసుగ్గా.

'చాలా ముద్దుగా ఉంది సుధా ఒకసారి చూడు'

'వద్దులెండి మీరే చూసుకొండి'

'అలా అనకు సుధా నేనే చూస్తాను. నేను లేనప్పుడు మాత్రం నువ్వు చూడు. అన్నట్టు ఇది వెజిటేరియన్ తినదు. కనీసం ఎగ్ అయినా ఉండాలి. వింటున్నావుగా.'

'ఆ, వింటున్నాను. పిల్లలకి రోజు ఎగ్ పెట్టము. దీనికి పెట్టాలా?'

'నీవు ఎంత పెడితే అంత రెట్టింపు విశ్వాసంగా ఉంటుందోయ్ మనుషులు కూడా ఉండరలా.'

★★★

'మున్ని చింటు ఎంతసేపు టామితో ఆటలు మీరు చదువుకొండి.'

'సుధా వంట అయిందా? అన్నాడు సుధాకర్.

'లేదండి మన్నకైంది. ఇంకా టామీకి కూర చేయాలి' అన్నది సుధ.

'దీనికి స్నానం చేయించావా?'

'లేదండి నాకు ఎక్కడ తీరుతుంది.'

'సరే సబ్బు పట్రా నేను చేయిస్తాను.'

సబ్బుతో రుద్ది టామికి స్నానం చేయించే వరకు సుధాకర్‌కు సుధాకర్‌కు నడుములు పట్టేసాయి. చక్కగా నిలపడటానికి రాలేదు.

'లేనిపోని తద్దినం తెచ్చుకున్నట్టయింది. క్యాంపుకు వెళ్ళొచ్చి రెస్ట్ తీసుకోకుండా దానికి స్నానం చేయించారు. దానితో మీకు నడుములు పట్టేశాయి. అందుకే వద్దన్నాను.'

'పోనీలే సుధా, ఎందుకలా అంటావు. కాసేపుంటుంది అదే సర్దుకొంటుంది. పిల్లలతో ఎంచక్కా కలసిపోయింది.'

'కలసిపోవడం కాదు వాళ్ళు దానితో ఆడుకుంటుంటే చదువుకాస్తా అటకెక్కుతుంది.'

★★★

పిల్లలను స్కూలుకు పంపి సుధ కూరగాయల కోసం బజారుకెళ్ళింది. రోడ్డుమీద గుంపుగా జనం ఉన్నారు. ఏదో యాక్సిడెంట్ అయినట్టుంది. గుంపులోకి తొంగిచూసి ఆశ్చర్యపోయింది. అక్కడ టామి కాలికి రక్తం కారుతూ పడివున్నది. అయ్యో ఇక్కడికెలా వచ్చింది. కాసేపు కుదురుగా ఉండదుకదా! జనంలోకి తోసుకుంటూ వెళ్ళి 'రిక్షా మాట్లాడి పెట్టండి. బాబు మా కుక్కపిల్లే' అన్నది అక్కడి జనంతో.

'కుక్కపిల్ల రోడ్డు దాటుతుండగా స్కూటర్ దాని కాలిమీదినుండి పోయిందమ్మా స్కూటరు ఆపకుండా వెళ్ళిపోయాడు. రక్తం బాగా కారుతుంది హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి' అంటూ రిక్షా తీసుకొచ్చారు.

సుధ వెటర్నిటీ హాస్పిటల్‌కి తీసుకెళ్ళి క్లీన్ చేయించి ఇంజక్షన్ ఇప్పించి తీసుకొచ్చింది.

సుధాకర్ ఇంటికి రాగానే టామీ మూలుగుతూ పడుకుంది.

'సుధ ఏమైంది టామీకి' అన్నాడు.

'అది ఉన్నచోట ఉంటుందా? రోడ్డు మీదకువెళ్ళి స్కూటరు కిందపడ్డది. ఇంకా నయం కాలుకు మాత్రమే దెబ్బతగిలింది. సమయానికి నేను వెళ్ళాను కనుక సరిపోయింది. లేకపోతే దాని గతి ఏమయ్యేది' అన్నది.

'అయ్యో స్కూటరు కింద పడ్డదా' అంటూ దాన్ని ఒళ్ళో పడుకోబెట్టుకొని జోకొడుతూ పడుకోబెట్టాడు.

'పిల్లలు అన్నం తిన్నారా సుధా.'

'టామీ తినకపోయేసరికి వాళ్ళు కూడా తినలేదు.'

'మున్ని, చింటూ టామీకి తగ్గిపోతుందమ్మా మీరు అన్నం తినండి' అన్నాడు.

'టామీకి బాగా నొప్పిగా ఉంది డాడీ అందుకే మేము తినలేదు' అన్నారు పిల్లలు.

'రేపు తగ్గిపోతుంది మీరు తినండి'

★★★

'నేను క్యాంప్‌కి ఈసారి పదిహేనురోజులు వెళ్ళాలి సుధా. పిల్లలకు సెలవులు కదా! మీరూ ఊరెళ్ళండి' అన్నాడు.

'టామీని ఏం చేద్దాం' అన్నది సుధ.

'దాన్ని కూడా తీసుకెళ్లండి.'

'పిల్లలతో నేను వెళ్ళటమే కష్టం టామీనెట్లా తీసుకెళ్ళను?'

'నేనిక్కడ టామీకి బాక్స్ బుక్ చేయించి మిమ్మల్ని ట్రైన్ ఎక్కిస్తాను. అక్కడ దిగిపోవడమేగా' అన్నాడు.

★★★

టామీని, సుధను, పిల్లలను ట్రైన్ ఎక్కించి సుధాకర్ వెళ్ళిపోయాడు.

ట్రైన్ బయలుదేరింది. వరంగల్ స్టేషన్‌లో ఆగానే సుధ టామీ దగ్గరికి వెళ్ళి చూసింది. అసలే ఎండాకాలం. దాహం వేస్తున్నట్టుంది నాలుక బయటకు చాపుతుంది. పిల్లల దగ్గర ఉన్న వాటర్ బాటిల్‌ను తీసుకొని టామికి తాపించి వచ్చింది. ఎంత దాహంగా ఉందో మొత్తం తాగేసింది. ట్రైన్ కదిలే సమయమైంది.

'తొందరగా వెళ్ళండమ్మా ట్రయిన్ కదుల్తుంది' అంటున్నారెవరో తొందరగా పిల్లల దగ్గరకు చేరుకుంది. పిల్లలు కూడా దాహం అంటున్నారు. బాటిల్‌లో నీళ్ళు అయిపోయాయి.

'అన్నీ టామీ తాగేసిందిరా, వచ్చే స్టేషన్‌లో తీసుకొస్తాను కాస్సేపు ఓపిక పట్టండి' అన్నది.

ట్రైన్ ఖమ్మం చేరుకునే వరకు సుధను ఎవరో పిలిచారు. టామీ ఉన్న బాక్స్ దగ్గరకు వెళ్ళింది. అందరూ దాని చుట్టూ ఉన్నారు. టామీ తలకాయ గ్రిల్స్‌లో ఇరుక్కొని రావడంలేదు.

'మీరు మెల్లగా తీయండమ్మా కొత్త కదా! మమ్మల్ని కరుస్తుంది' అన్నారు.

'నేను తీస్తుంటే దానికి నొప్పి కలిగితే నన్ను కూడా కరుస్తుంది కదా!' అన్నది సుధ.

'మరేం చేద్దాం' అన్నారు.

'మీరే ఎలాగో తీయండి' అన్నది సుధ.

ఒకతను ఫోర్‌సెప్స్ తేవడానికి వెళ్లాడు.

సుధకు చాలా విసుగ్గా ఉంది. అక్కడ పిల్లలు, ఇక్కడ టామి. ఈలోపు టామి తలకాయ అదే గ్రిల్స్ నుండి తీసుకుంది. 'హమ్మయ్య' అనుకుంటూ సుధ పిల్లల దగ్గరకి వెళ్ళింది. ఎలాగో విజయవాడ చేరుకున్నారు.

★★★

అమ్మమ్మ వాళ్ళింట్లో పిల్లలకు సెలవులు తెలియకుండానే గడిచిపోయాయి. చదువుకోవడం లేకపోవడం ఫ్రీగా ఉండటంవలన మళ్ళీ వెళ్ళడం అన్నది దిగులు పెట్టుకున్నారు.

మళ్ళీ దసరా సెలవులకు తీసుకు వస్తాను అని చెప్పి సుధ పిల్లలతో బయలుదేరింది. టామీని అక్కడే ఉంచింది. వచ్చిన దగ్గర నుండి అందరు ఏదో పోగొట్టుకున్నవాళ్ళలా ఉన్నారు. పిల్లలు అసలు హుషారుగా లేరు. సుధాకర్ అసలు భోజనమే చేయటంలేదు. సుధకు అసలు ఏ పని చెయ్యాలనిపించడం లేదు.

★★★

'అమ్మగారు' అన్న పిలుపుకు ఈ లోకంలోకి వచ్చింది సుధ. ఒక కుర్రాడి చేతిలో టామి ఉంది. దానిని చూడగానే పోయిన ప్రాణం లేచి వచ్చినట్టయింది.

'టామి అక్కడ హుషారుగా ఉండటంలేదు. అసలు అన్నం తినటంలేదమ్మా. మీమీద దిగులు పెట్టుకున్నదని అమ్మగారు పంపించారు' అన్నాడు. పిల్లలు ఒక్క ఉదుటున టామి దగ్గరకు వచ్చారు. టామి వచ్చి సుధ చీరకొంగు దగ్గర కూర్చుంది. 'మాతల్లె మమ్మల్ని వదల్లేక వచ్చావా' అంటూ అక్కున చేర్చుకుంది. వాళ్ళ మమకారాన్ని చూసి సుధాకర్ ఆశ్చర్యపోయాడు.